రిజర్వేషన్లు ఇవ్వకుండా తుంచేసే కుట్ర

- దీన్ని బిసి సమాజం తిప్పికొట్టాలి
- కులగణనతో మోడీ మెడపై కత్తి వేలాడుతుందనే బిజెపి, బిఆర్ఎస్ గగ్గోలు
- అందుకే లెక్కలు తప్పంటున్నారు
- ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు
- పద్మశాలీల ఆత్మీయ సభలో సిఎం రేవంత్‌రెడ్డి

మగ్గం నేస్తున్న సిఎం రేంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్రలు జరుగుతున్నాయనీ, వీటిని బిసి సమాజం తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. రాహూల్‌గాంధీ పిలుపు మేరకు రాష్ట్రంలో కులగణన నిర్వహించి, అసెంబ్లీలో తీర్మానం చేశామనీ, దీనితో ప్రధాని నరేంద్రమోడీ మెడపై కత్తి వేలాడుతున్నదని గమనించి, బిజెపి, బిఆర్ఎస్ గగ్గోలు పెడుతున్నాయని చెప్పారు. అందుకు ఆ రెండు పార్టీలు కులగణన లెక్కలు తప్పు అని ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. మాజీ సిఎం కె చంద్రశేఖరరావు లెక్కల్లో రాష్ట్రంలో ఉన్నత కులాలు 21 శాతం ఉన్నాయని పేర్కొన్నారనీ, తమ సర్వేలో అగ్రవర్ణాలు కేవలం 15.28 శాతం మంది మాత్రమే ఉన్నారని నిర్ధారణ అయ్యిందని వివరించారు. అఖిల భారత పద్మశాలి మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కులగణన చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సభను నిర్వహించారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఆత్మగౌరవం, త్యాగంలో పద్మశాలీలు ముందుంటారనీ, దానికి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవిని త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీనే నిదర్శనమని చెప్పారు. తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకునేందుకు తన సొంత ఇంటినే వేదిక చేసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అనీ, అలాంటి వ్యక్తి మరణిస్తే గత ప్రభుత్వం కనీసం నివాళులు కూడా అర్పించకుండా అవమానించిందని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో ముందున్న మరో వ్యక్తి టైగర్ ఆలే నరేంద్ర అనీ, ఆయన్ని కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రిని చేస్తే, కేసీఆర్ ధృతరాష్ట్ర కౌగిలితో ఆయన్ని ఖతం చేశారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసుకొని, దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామనీ, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కూడా ఆయన పేరే పెడతామని ప్రకటించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రూ.600 కోట్ల విలువైన ఒక కోటి 30 లక్షల చీరల ఆర్డర్‌ను నేతన్నలకు ఇచ్చి చేనేత రంగాన్ని ఆదుకుంటున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇక్కడి పద్మశాలీలు కీలకపాత్ర పోషిస్తున్నారనీ, షోలాపూర్‌లో నిర్మించే మార్కండేయ భవనానికి రూ.కోటి నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. పద్మశాలీయులకు ఆర్థికంగా, రాజకీయంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'యంగ్ ఇండియా'కు రూ.11వేల కోట్లు మంజూరు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం రూ.11వేల కోట్ల నిధుల్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే విద్యాశాఖకు ఇంత భారీ మొత్తంలో ఏకకాలంలో నిధులు కేటాయించడం తొలిసారి అని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు భవిష్యత్‌లో ప్రపంచాన్ని శాసించే సంస్థల్లో పనిచేసే విధంగా ఎదుగుతారనీ, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని వివరించారు. తొలి విడతలో అంతర్జాతీయ ప్రమాణాలతో 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన, సామాన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గతంలో ఈ పాఠశాలల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.600 కోట్లు నిధుల్ని కేటాయించిందని గుర్తుచేశారు. ఒక్కో పాఠశాల దాదాపు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో, అద్భుతమైన క్రీడా ప్రాంగాణాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అక్కడే నివాస వసతి ఏర్పాట్లతో గృహ సముదాయాలు ఉంటాయని వివరించారు. ఆధునికి సాంకేతికతతో, అంతర్జాతీయ ప్రమాణాలతో, డిజిటల్ విద్యా బోధన చేసేలా ఈ పాఠశాలలు డిజైన్ చేయబడ్డాయని తెలిపారు. విద్యార్థులకు కావలసిన ల్యాబ్స్, లైబ్రరీ, మినీ యాప్ థియేటర్ కూడా ఉంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వీటి నిర్మాణం, విద్యాబోధన ఉంటాయనీ, సామాజిక మార్పును తెస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

మంత్రి పొంగులేటికి మొక్కను అందజేస్తున్న రెవెన్యూ సంఘాల నేతలు

ప్రజలకు నిబద్ధతతో సేవలందించండి

- భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి
- రెవెన్యూ సంఘాల నేతలతో మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులు కష్టపడి పని చేయడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు ఇటీవల పలు వరాలు ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి కృజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి భూ భారతిని త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కొత్తగా పోస్టుల మంజూరు చేసిందన్నారు. 10,954 గ్రామ స్థాయి పరిపాలన అధికారులు (జిపిఒ), కొత్త డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను మంజూరు చేసినట్టు తెలిపారు. తమ ప్రభుత్వం ఉద్యోగులకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగుల వేతనాలను నెల మొదటి వారంలోనే ఇస్తున్నామన్నారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, మహిళా అధ్యక్షురాలు రాధ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి భిక్షం, సిసిఎల్ఎ యూనిట్ అధ్యక్షులు రాంబాబు, తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు, ప్రధాన కార్యదర్శి వి లక్ష్మీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్1 ప్రొవిజినల్ మార్కులు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల్లో అభ్యర్థులు పొందిన అభ్యర్థులు సాధించిన ప్రొవిజినల్ మార్కుల వివరాలను టిజిపిఎస్సి సోమవారం ప్రకటించనుంది. గ్రూప్ -1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగియగా.. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడికి అంతా సిద్ధం చేసింది. ముందుగా అభ్యర్థుల మార్కులను వెల్లడించి, ఆ తరువాత అభ్యంతరాలున్న వారి నుంచి రీకౌంటింగ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఆ ప్రక్రియ ముగిసిన తర్వాత 1:2 నిష్పత్తిలో జాబితాను కమిషన్ వెల్లడించనుంది. కాగా, అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్- 1 ప్రధాన పరీక్షలకు 21,093 మంది అభ్యర్థులు హాజరుకాగా, ఒక్కో పోస్టుకు దాదాపు 38 మంది పోటీపడుతున్నారు.లరాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో జరిగిన మొదటి గ్రూప్ -1 పరీక్షల ఫలితాలు కావడంతో అధికారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2022లోనే 503 పోస్టులతో గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేయగా, పరీక్షల నిర్వహణలో అక్రమాలు, పేపర్ లీకేజీల కారణంగా గ్రూప్- 1 ప్రిలిమ్స్ రెండుసార్లు రద్దయింది. అనంతరం ఆ నోటిఫికేషన్‌కు మరో 60 పోస్టులు పెంచి 563 పోస్టులతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది జూన్ 9న ప్రిలిమ్స్, అక్టోబర్ 21 నుంచి ప్రధాన పరీక్షలు జరిగాయి.

మహిళా కార్మికుల కాళ్లు కడిగిన కార్పొరేటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఘనంగా సన్మానించారు. డివిజన్‌లో పని చేస్తున్న పలువురు మహిళా పారిశుద్ధ్య కార్మికుల కాళ్లను కార్పొరేటర్ కడిగారు. మహిళలను గౌరవించి.. వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిని బిఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఆ పార్టీ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ పేరును బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట చంద్రశేఖరరావు ఆదివారం ప్రకటించారు. ఆయన సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌కెఎం నాయకులు

13న ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో రైతుల ధర్నా

- అంబానీ, అదానీ కంపెనీలకు వ్యవసాయాన్ని కట్టబెట్టే యత్నం
- మోడీ సర్కారు రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి : ఎస్‌కెఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ నెల 13న వేలాది మంది రైతులతో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కన్వీనర్లు పశ్యపద్మ, టి సాగర్, జక్కుల వెంకటయ్య, నాయకులు మూఢ్ శోభన్ నాయక్, శ్రీనివాస్ ప్రకటించారు. ఈ నెల 12 వరకు జిల్లాల్లో ధర్నాలు చేయాలని కోరారు. ఈ ధర్నాలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆఫీసులో 13న జరిగే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను మోడీ సర్కారు దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఫసల్ బీమా యోజన పథకం బీమా కంపెనీలకు ఉపయోగపడుతున్నదని తప్ప దాని ద్వారా రైతులకు ప్రయోజనం దక్కట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని రైతులకు ఉపయోగపడేలా మార్చాలని సూచించారు. దేశవ్యాప్తంగా రైతుల కోసం రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయకుండా మోడీ సర్కారు నాన్చుతోందని విమర్శించారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం రైతులకు నష్టదాయకంగా మారబోతున్నదని చెప్పారు. అదానీ, అంబానీ కంపెనీల ఏజెంట్లు ధాన్యాన్ని సేకరించేలా, కార్పొరేట్లకు వ్యవసాయాన్ని అప్పగించేలా కేంద్రం కుట్ర పన్నుతున్న తీరును ఎండగట్టారు. వ్యవసాయ పరిశోధనా సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడాన్ని తప్పుబట్టారు. రైతులను సాగు నుంచి దూరం చేసేందుకే ఎరువుల సబ్సిడీల్లో కోత విధించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రుణమాఫీ, రైతుభరోసా, రైతు బీమా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం వరికే కాకుండా అన్ని పంటలకూ బోనస్ ఇవ్వాలని కోరారు. రైతులకు నష్టం చేకూర్చే జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తీసుకురావొద్దనీ, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలనీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు నిధులు ఆపడం సరికాదు

- కేంద్ర బడ్జెట్‌లో గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను పునరుద్ధరించాలి
- ఇందిరా పార్కు వద్ద ధర్నాలో పలువురు వక్తలు
- కుటుంబాలతో కదిలి వచ్చిన ఎన్ఐఆర్‌డిపిఆర్ ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డిపిఆర్) సంస్థకు నిధులు ఆపడం సరిగాదని పలువురు వక్తలు చెప్పారు. కేంద్ర బడ్జెట్ సవరణల్లో ఆ సంస్థకు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంస్థను ప్రయివేటీకరించే ఆలోచనను విడనాడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని తప్పుబడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద వందలాది మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర నాయకులు డిజి నర్సింహారావు మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధిలో, జాతీయ ఉపాధి హామీ చట్టం అమలులో కీలక భూమిక పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు కేంద్రం నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు. కేంద్రం నిర్ణయం వల్ల 221 మంది రెగ్యులర్, 410 మంది కాంటాక్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేసిందని, 300 మందికి పైగా పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కూడా తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్న సంస్థకు నిధులు కేటాయించకపోతే దేశ ఆర్థిక ప్రగతి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దేశంలోనే కీలకమైన ఈ సంస్థ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంస్థకు నిధులు కేటాయించకపోవడంపై పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపిలు చర్చ పెట్టాలని కోరారు. బిఆర్ఎస్ నాయకులు పి కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని పంచాయతీల బలోపేతానికి కృషిచేస్తున్న ఎన్ఐఆర్‌డిపిఆర్ గురించి వివరించారు. ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు గ్రామీణాభివృద్ధి.. పంచాయతీరాజ్ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే సంస్థకు నిధులు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ఎ ప్రసాద్ మాట్లాడుతూ.. 2025-26 కేంద్ర బడ్జెట్లో ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు నిధులు కేటాయించకపోవడంతో ఆ సంస్థ భవిష్యత్తు అనిశ్చితంగా మారిందని చెప్పారు. 65 ఏళ్లుగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ సంస్థకు ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని గుర్తుచేశారు. అకస్మాత్తుగా నిధులు ఉపసంహరించుకోవడం వలన ఆ సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అకడెమిక్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ జ్యోతిస్ సత్యపాలన్, డాక్టర్ సి ధీరజ, డాక్టర్ రాజేష్ కుమార్ సిన్హా, డాక్టర్ సి కాతిరేసన్, డాక్టర్ పల్లా అనురాధ, డాక్టర్ ఎంవి రవిబాబు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డి రామకృష్ణ, ఎ పరశురాముడు, సుశీల్ కుమార్, మహమూద్ అలీ, డి సరోజ, పెన్షనర్ల సంఘం నాయకులు జంగయ్య, మురళి మాట్లాడుతూ.. తమ సంస్థ గొప్పతనాన్ని వివరించారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం గత బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించి 73.68 కోట్లే ఖర్చుపెట్టిందని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1 లక్షకు తగ్గించడంతో అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులు, పెన్షనర్లు, గ్రామీణాభివృద్ధిలో పాల్గొన్న వాటాదారులలో తీవ్రమైన ఆందోళనలను రేకెత్తించిందన్నారు. 2008లో తమ సంస్థ స్వర్ణోత్సవాలను జరుపుకున్నదనీ, హైదరాబాద్‌లోని ప్రధాన క్యాంపస్‌తో పాటు అస్సాంలోని గౌహతిలో ఈశాన్య ప్రాంతీయ కేంద్రం, న్యూఢిల్లీలో ఒక శాఖ, బీహార్‌లోని వైశాలిలో కెరీర్ గైడెన్స్ సెంటర్ ఉన్నాయని చెప్పారు. తమ సంస్థకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులకిచ్చిన హామీలను అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడచినప్పటికీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకిచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయనందున ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకుందని, వాటి అమలుకు తక్షణం ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీ గడువు ముగిసి 20 నెలల కాలం గడిచిందనీ, అధికారంలోకి రాగానే ఆరు నెల్లలో పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నప్పటికీ, పెండింగ్ బకాయిల బిల్లులు జిపిఎఫ్, టిఎస్‌జిఎల్ఐ సరెండర్ లీవ్ బిలులు, మెడికల్ బిల్లులు, రిటైరయిన వారి బెనిఫిట్స్ సంవత్సరాల పర్యంతం చెల్లించకపోవడం వలన ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు, అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆరు నెల్లకోసారి చెల్లించాల్సిన కరువు భత్యాలను (డిఎ) చెల్లించకపోవటం, సిపిఎస్ రద్దుకిచ్చిన హామీ అమలుకు పూనుకోకపోవడం సమంజసం కాదన్నారు. వీటిని సాధించుకోవటం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే కానీ.. ఎన్నికల్లో ప్రవేశించిన కుల, మతతత్వ ధోరణులు డబ్బు, మద్యం ప్రభావాల పట్ల అప్రమతంగా ఉండాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న డిఎలను ప్రకటించాలి

టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకటి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేరుకుపోయిన వివిధ రకాల పెండింగ్ బకాయిల విషయంలో మార్చినాటికి చెల్లిస్తానని ప్రభుత్వం జెఎసితో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. మళ్లీ 16 నెల్ల గడువు పేరుతో కాలయాపన చేయటం సమంజసం కాదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బకాయిల విషయంలో చొరవచూపాలనీ, లేదంటే ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు. ఆర్థికేతర అంశాలలో భాగంగా సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలనీ, 2003 డిఎస్‌సి వారికి కేంద్రం ఇచ్చిన మెమో 57 ప్రకారం ఒపిఎస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి-2024 వారికి అక్టోబర్ 10 నుంచి వేతనాలు చెల్లించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా పాఠశాలల సమయపాలనను మార్చాలన్నారు. మిగిలిన పండిత్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని పండిత్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె జంగయ్య, సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె సోమశేఖర్, ఎం. రాజశేఖర్‌రెడ్డి, జి నాగమణి, కె రవికుమార్, డి సత్యానంద్, ఎ సింహాచలం, జి శ్రీధర్, ఎం వెంకటప్ప, వై జ్ఞానమంజరి, వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

యువ కార్మిక నాయకులు నైపుణ్యాలు పెంచుకోవాలి : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువ కార్మిక నాయకులు తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలనీ, కార్మికుల హక్కుల పోరాటాల రూపకల్పన కోసం, సమస్యల పరిష్కారం కోసం లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ కార్మిక నాయకులకు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ క్లాసులు బోధించారు. ప్రారంభోత్సవం సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ..29 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తీరును ఎండగట్టారు. మోడీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. దేశసంపదను నూతన పద్ధతుల్లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతున్న తీరును వివరించారు. కార్మికులు పోరాడిసాధించుకున్న హక్కులను హరించి, శ్రమ దోపిడీచేస్తుందని చెప్పారు. కనీస వేతనాలు పెంచకుండా ఫ్లోర్ లేవర్ మినిమమ్ పేరుతో రోజుకు రూ.178 వేతనం నిర్ణయించడం దారుణమన్నారు. ఆ వేతనంతో బీజేపీ నేతలు బతికి చూపించాలని సవాల్ విసిరారు. మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడం కోసం దేశ వ్యాప్తంగా బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించాల్సి అవసరముందని నొక్కి చెప్పారు. కార్మికవర్గ ఐక్యతను కుల, మతాల పేరుతో చీల్చుతున్న తీరును ఉదాహరణలతో వివరించారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టి కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలంటే యువ నాయకత్వం దానికనుగుణంగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి బి మధు ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జలం.. జటిలం..

- అనేక చోట్ల వృథాగా భగీరథ ట్యాంకులు
- భూగర్భజలాలు పడిపోవడంతో పనిచేయని చేతిపంపులు
- ఏజెన్సీలో తాగునీటికి జనం తిప్పలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జలం సమస్య జటిలమైంది.. వేసవి రాకముందే ఎండలు మండుతుండటంతో భూగర్భజలాలు అడుగంటాయి.. ఏజెన్సీల్లో వర్షాకాలంలో పుష్కలంగా కనిపిస్తున్న జలం.. వేసవి రాగానే అడుగంటిపోతోంది. నీటి కోసం జనం కోటి తిప్పలు పడాల్సి వస్తోంది. ఫిబ్రవరిలోనే మొదలైన తాగునీటి సమస్య ఇప్పటికి మరింత జటిలంగా మారింది. ప్రభుత్వం రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మించిన మిషన్ భగీరథ పథకం ఇంకా బాలారిష్టాలు దాటడం లేదు. కొండలు, గుట్టల మీది నుంచి ఆయా పల్లెలకు వెళ్లిన పైప్‌లైన్ల నుంచి ట్యాంకులకు నీరు ఎక్కడం లేదు. మరోపక్క మధ్యలోనే అనేక చోట్ల పైప్‌లైన్లు, వాల్వ్‌ల వద్ద లీకేజీలు కావడంతో నీరు ట్యాంకుల వరకు చేరడం లేదు. మరికొన్ని చోట్ల నిర్మించిన ట్యాంకులకు కనెక్షన్ కూడా ఇవ్వని పరిస్థితి. ఆయా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడూ పరిష్కరించాల్సిన అధికారులు నిధుల లేమి కారణం చూపి అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

ఆదిలాబాద్ జిల్లాలో వేసవి రాగానే తాగునీటి సమస్య తలెత్తడం సాధారణంగా మారింది. భూగర్భజలాలు లోతులకు పడిపోవడంతో అనేక చోట్ల స్థానిక నీటి వనరులైన చేతిపంపులు పనిచేయడం లేదు. అధికారులు చేతిపంపులు కొన్నింటికి మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటికి ఇబ్బందులు ఎదువుతున్నాయి. ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ గ్రామంలో కొన్ని రోజులుగా భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ఊరి చివరన పంట పొలంలో ఉన్న బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. ఇదే మండలంలోని కోయల్ పాండ్రి గ్రామంలో భగీరథ ట్యాంకు వృథాగా ఉంది. ఊరి చివరన బోరు వేయించారు. ప్రజలు అక్కడ్నుంచి పైప్‌ల ద్వారా పాత ట్యాంకులోకి మళ్లించి నీటిని తాగుతున్నారు. ఇలా జిల్లాలోని అనేక చోట్ల తాగునీటికి ఆదివాసీ గిరిజనులు తిప్పలు పడుతున్నారు.

10మీటర్ల లోతులకు జలాలు..

ఆదిలాబాద్ జిల్లా అంటేనే కొండలు, గుట్టలు అధికంగా ఉంటాయి. వర్షాకాలంలో అధిక వర్షాలు ఇక్కడే నమోదవుతున్నా వేసవి వచ్చే సరికి అవి భూగర్భంలో కూడా కనిపించకుండా పోతున్నాయి. ఈ ఏడాది జనవరిలో ఏడు మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ఫిబ్రవరిలో 8.54 మీటర్లకు పడిపోయాయి. మార్చికి వచ్చే సరికి 10 మీటర్లకు పడిపోయాయని భూగర్భజల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా చేతి పంపులు కూడా పనిచేయకుండా పోతున్నాయి. కొన్ని చేతిపంపులు గంటపాటు కొడితే బిందెడు నీళ్లు రాగా, మరికొన్ని అసలే పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు అక్కడక్కడ కొన్నింటికి మరమ్మతులు చేయించి వదిలేశారు. ఇచ్చోడ మండలం బాబ్జీపేట్ గ్రామాలు, ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్, గౌరాపూర్, తేజాపూర్ తదితర పల్లెలతోపాటు ఉట్నూర్, గాదిగూడ, నార్నూర్ తదితర మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లోని కొన్ని పల్లెల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రతి ఏటా తాగునీటి సమస్య తీవ్రమవుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి నిధులు కేటాయించి శాశ్వత ప్రతిపాధికన బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం
అంజలి, దస్నాపూర్, ఇంద్రవెల్లి మండలం

మా ఊరిలో మిషన్ భగీరథ ట్యాంకు పనిచేయడం లేదు. కొన్ని రోజుల నుంచి నీళ్లు రావడం లేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఊరి చివరన పంట పొలంలోని బోరు నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

సమస్యలు పరిష్కరిస్తున్నాం
చంద్రమోహన్, భగీరథ ఈఈ, ఆదిలాబాద్

జిల్లాలో మిషన్ భగీరథ నీరు చాలా చోట్ల సరఫరా అవుతోంది. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. చేతిపంపుల మరమ్మతులు ఆయా పంచాయతీలే చేయించాల్సి ఉంటుంది.

ప్రజానాయకునిగా ఎదిగిన ఐలయ్య

- బిజెపి రూపంలో మతోన్మాద ప్రమాదం
- లౌకిక శక్తుల ఐక్యత కీలకం
- కాసాని ఐలయ్య సంస్మరణ సభలో తమ్మినేని, జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలంటే ఐలయ్యలా ఉండాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బిజెపి రూపంలో దేశ, రాష్ట్రానికి మతోన్మాద ప్రమాదం ముంచుకొచ్చిందన్నారు. లౌకికశక్తులను ఐక్యం చేసి కమ్యూనిస్టులు విస్తృత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లోని కాసాని నగర్‌లో ఆదివారం సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు వీర్ల రమేశ్ అధ్యక్షతన జరిగిన ఐలయ్య సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడారు. వరంగల్ జిల్లా నుంచి వచ్చిన ఐలయ్య సుజాతనగర్, కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానున్నాననే నమ్మకాన్ని కలిగించారన్నారు. మార్క్సిజం మీద పట్టు, ఆ సిద్ధాంతాన్ని చివరికంటా తీసుకెళ్లే అంకితభావం, క్రమశిక్షణ ఉంటే కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఎదగొచ్చని ఐలయ్య నిరూపించారని తెలిపారు. కాసాని ఐలయ్య ఒక్క కమ్యూనిస్టు పార్టీకే కాదు.. ప్రజా నాయకునిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పేదలకు అండగా ఉండే ఓ ఆదర్శ సిద్ధాంతమైన కమ్యూనిజానికి ఆదరణ తగ్గుతోందన్నారు. పెట్టుబడిదారీ విధానంలోనే అంతర్గత సంక్షోభం ఉందన్నారు. అమెరికాలో ట్రంప్, మనదేశంలో మోడీ మూడోసారి గెలిచాక సంక్షోభాలు మరింతగా పెరిగాయన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని తెలిపారు.

ఐలయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన బాగోలేదని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు కానీ.. ఈ రెండు పార్టీలూ బిజెపి రూపంలో ముంచుకొస్తున్న మతోన్మాద ప్రమాదాన్ని గుర్తించటం లేదన్నారు. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి గెలవటం ప్రమాదానికి సంకేతమని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట గడ్డ మీద మతోన్మాద పార్టీలు బలోపేతం అవుతుండటం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు. రాబోయే కాలంలో లౌకిక శక్తుల ఐక్యత కీలకమని తెలిపారు. ఇలాంటి సమయంలో మతోన్మాదాన్ని ఎదుర్కొనే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని గుర్తించాలన్నారు. ఎర్రజెండాను ముందుకు తీసుకెళ్తే తప్ప భవిష్యత్తు ఉండదని స్పష్టంచేశారు. కమ్యూనిస్టులు బలహీనపడ్డారని, వారి పనయిపోయిందని ఎవరైనా అనుకుంటే పొరపాటని.. 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి'ని ఆపలేరన్నట్టుగా ఈ పెట్టుబడిదారీ సమాజంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆపటం ఎవరితరం కాదన్నారు. ఐలయ్య లాంటి నాయకులు మరింత మంది ఉద్భవించాలని ఆకాంక్షించారు. ఆ విశ్వాసంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పోరాటమంటే ఐలయ్య : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇండ్ల స్థలాలు, పోడు భూములు, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన ఏ పోరాటమైనా కాసాని ఐలయ్య ముఖ్య భూమిక పోషించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. దాడులు, హత్యాయత్నాలకు వెరవకుండా ఐలయ్య పోరాట స్ఫూర్తి కనబరిచారని కొనియాడారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం, లౌకికతత్వంపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. మతోన్మాదం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాల్సిన తరుణంలో ఐలయ్య లాంటి ఉద్యమకారుడు లేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో మతసామరస్యం లోపిస్తోందని, కులతత్వ ధోరణులు, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని తెలిపారు. కమ్యూనిస్టుల బలం ఓట్లు, సీట్లలో కాదని, ప్రజాపోరాటాల్లో చూడాలని అన్నారు. శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు ఎర్రజెండా పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లటమే ఐలయ్యకు మనమిచ్చే నివాళి అని తెలిపారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య కుటుంబ సభ్యులు కుమారుడు కాసాని లెనిన్, కోడలు పావని, కుమార్తె, అల్లుడు జ్యోతి, కృష్ణ హాజరయ్యారు. సభలో మాజీ ఎంపి మిడియం బాబూరావు, పార్టీ సీనియర్ నాయకులు రాజారావు, పి సోమయ్య, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేశ్, అన్నవరపు కనకయ్య, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎ మధు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కోనేరు చిన్ని, మండె వీరహనుమంతరావు, టిజెఎసి రాష్ట్ర నాయకులు రామనాథం, ఐలూ రాష్ట్ర నాయకులు శివరాంప్రసాద్, సిపిఐ జిల్లా నాయకులు దసూరు, బిఆర్ఎస్ నాయకులు తులసీరెడ్డి, జిఎంపిఎస్ రాష్ట్ర నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, టి లింగయ్య, యలమంచి రవికుమార్, సిపిఎం ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి పద్మ, కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, కె బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, కారం పుల్లయ్య, ఎంబి నర్సారెడ్డి, ఎం జ్యోతి, కున్సోత్ ధర్మ, కొమరారెడ్డి, ఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులే అమ్మా... నాన్న

- యువతికి పెళ్లి జరిపించిన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కన్నవారిని కోల్పోయిన ఆ అమ్మాయికి అధికారులే అమ్మానాన్నలయ్యారు. మేమంతా ఉన్నామంటూ కన్యాదానం చేశారు. బంధువులుగా మారి వైభవంగా పెళ్లి జరిపించారు. ఈ వేడుకకు కరీంనగర్‌లోని కళాభారతి ఆడిటోరియం వేదిక అయింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. ఈ పెళ్లికి పెద్దలుగా వ్యవహరించారు. మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో.. బాల సదనంలో పెరిగిన అనాథ యువతి మౌనికకు.. తాను ప్రేమించిన సాయి తేజతో వైభవంగా ఆదివారం వివాహం జరిపించారు. నూతన దంపతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని కలెక్టర్ పమేలా సత్పతి భరోసా ఇచ్చారు.

వర్గీకరణ లేకుండానే ఉద్యోగాల భర్తీ ఎలా చేస్తారు?

- మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వర్గీకరణ పూర్తికాకుండానే ఆగమేఘాల మీద ఉద్యోగాల భర్తీ ఎందుకు చేస్తున్నారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు.ఆదివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. గ్రూప్ 1,2 తో పాటు అనేక పోస్టులకు వారంలోనే ఫలితాలెందుకు ప్రకటించనున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యోగ నియామకాల విషయంలో ఎస్‌సిలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఫలితాల ప్రకటన ఆపకపోతే ఎస్సీ నిరుద్యోగుల ఆగ్రహానికి రాజకీయ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి మాలల భ్రమలో ఉన్నారని, మాలల ఒత్తిడికి తలొగ్గి పని చేస్తున్నారని ఆరోపించారు. నేటి నుంచి వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు జిల్లాల్లో నిరవధిక దీక్షలు చేస్తామని ప్రకటించారు. వర్గీకరణకు మద్దతిచ్చే సంఘాలు.. రాజకీయ పార్టీలను కలుపుకుపోతామని తెలిపారు. అన్ని యూనివర్సిటీల్లో దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగతో పాటు ఆ సంఘం రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటిటివ్స్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటిటివ్స్ యూనియన్ (టిఎంఎస్ఆర్‌యు) డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ జనరల్ కౌన్సిల్ సమావేశాలు రోజు ఉత్సాహంగా కొనసాగాయి. యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ భానుకిరణ్ ప్రవేశపెట్టిన నివేదికపై 15 జిల్లాల నుంచి హాజరైన కౌన్సిల్ సభ్యులు తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. సమావేశంలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటీటివ్స్‌కు కనీస వేతనాలు నిర్ణయించాలని, కేంద్ర ప్రభుత్వం కొత్త తెస్తున్న లోబర్ కోడ్‌లను రద్దు చేయాలని తీర్మానించారు. అదే విధంగా ఆల్బర్ట్‌డేవిడ్, సానోఫీ, వాల్లస్ యాజమాన్యాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రవేశపెట్టారు. జనరల్ కౌన్సిల్ సభ్యులు ఇచ్చిన సూచనల మేరకు ప్రధాన కార్యదర్శి, కోశాధికారి నివేదికలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కృష్ణానంద్, తమిళనాడు మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటీటివ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వాసుదేవన్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటిటివ్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యుఎస్ రవి ప్రసంగించారు. టిఎంఎస్ఆర్ యు సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ'

- ఆరుగురుతో నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు సభ్యులతో కూడిన 'స్టేట్ కో ఆర్డినేషన్ కమిటీ'ని అధిష్టానం నియమించింది. ఈ మేరకు శనివారం టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సిడబ్ల్యుసి సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎస్ఎ సంపత్ కుమార్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, తాహెర్ బిన్ అహ్మద్, తేజావత్ బెల్లయ్య నాయక్, వెన్నెల గద్దర్ సభ్యులుగా ఉన్నారు. వీరంతా 'జైబాపు... జైభీమ్... జైసంవిధాన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కమిటీని నియమించింది.

కుటుంబం నుంచే లింగ వివక్ష

- చట్టాలెన్ని ఉన్నా మహిళలపై ఆగని అఘాయిత్యాలు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"భారతీయ సమాజంలో లింగవివక్షత కుటుంబం నుంచే అనాదిగా వస్తోంది. తాతాల తండ్రుల కాలం నుంచి సాంప్రదాయాలు, ఆచారాలంటూ చిన్న పిల్లల మెదళ్లలో రంగరించి పోస్తున్నారు. పెంపకం మొదలు చదువు, ఆర్థిక సేచ్ఛ వరకు అన్నింటా తల్లిదండ్రులు మగ పిల్లలను ఓ రకంగా, ఆడపిల్లలను మరో రకంగా చూస్తున్నారు. ఇది సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఫలితంగా మహిళలపై, దాడులు అఘాయిత్యాలు ఆగడం లేదు. ఈ ధోరణి పూర్తిగా మారాలి. లింగ సమానత్వం అనేది కుటుంబం నుంచే ప్రారంభం కావాలి" అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. "అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వీనింగ్ కమిటీ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఛేంజింగ్ లీగల్ ల్యాండ్ స్కేప్ అండ్ రైట్స్ ఆఫ్ ఉమెన్" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఐలు మహిళా రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ సీహెచ్ శైలజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ రాధారాణి ప్రధాన అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్త్రీలు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ఇంటి పనులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత, వృత్తి, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడంలో తీవ్ర ఒత్తిళ్లకు గురువుతున్నారని వ్యాఖ్యానించారు. స్త్రీలతో పాటు పురుషులు కూడా ఇంటి బాధ్యతలను సమానంగా పంచుకోవాలని సూచించారు. కుటుంబం నుంచి మొదలైన సమానత్వం మంచి సమాజాన్ని నిర్మించేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. చివరికి న్యాయం అందించే న్యాయస్థానాల్లో కూడా ఈ ధోరణి అక్కడక్కడా కనిపిస్తోందని అన్నారు. 1930కి ముందు స్త్రీలకు కనీస హక్కులు లేవనీ, స్వాతంత్ర్యానంతరం ఓటు, ఆస్తి తదితర హక్కులను రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలు కుటుంబం నుంచి వృత్తి జీవితం వరకు అనేక రకాలుగా వివక్షతలకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. మద్రాస్ హైకోర్టు న్యాయవాది, ఐలు జాతీయ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు చంకిరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు 75 ఏండ్ల తర్వాత కూడా అమలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. హైదరాబాద్, ముంబాయి, కోల్‌కతా తదితర 14 ప్రధాన నగరాల్లో చేసిన సర్వే ప్రకారం 69 శాతం మంది మహిళలు తమ సంపాదనపై నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఇది ఎలాంటి సమానత్వాన్ని సూచిస్తుందో ఆలోచించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని విమర్శించారు. రేజ్లర్ వినేశ్‌ఫోగట్ తదితర సంఘటనలు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర కార్యదర్శి కె పార్థసారథి, ఐలూ రాష్ట్ర కమిటీ మహిళా జనరల్ సెక్రటరీ ఎం వనజ, కో కన్వీనర్ మంజుల, నాయకులు ఉమాదేవి అన్నపూర్ణ, భారత లక్ష్మి కుమారి, రామచంద్రారెడ్డి, మాధవరెడ్డి, ప్రవీణ్, శర్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎండలు

- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న నిపుణులు
- చిన్నపిల్లలు, వృద్ధులకు మరింత జాగ్రత్తలు అవసరం
- ముందు జాగ్రత్తగా ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్సకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎండలు పెరుగుతున్నాయి. క్రమంగా వాతావరణం వేడెక్కుతోంది. వేసవికాలం సమీపిస్తుండడంతో గత రెండు, మూడు రోజుల్లోనే వాతావరణంలో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల సెంటిగ్రేడ్స్ పెరిగినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు డీహైడ్రేట్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులతో పాటు వైద్యారోగ్యశాఖ అప్రమత్తం చేశాయి. వాతావరణంలో మార్పులు, పర్యావరణ సమతుల్యం తెబ్బతినడం, గ్లోబల్ వార్మింగ్ పెరగడం, మనిషి కలుషిత ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, రోగ నిరోధక శక్తి తగ్గడం తదితర కారణాలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. వీలైనన్ని ఎక్కువసార్లు నీళ్లు తాగాలని, దాహంగా లేకపోయినా సరే తరచూ నీళ్లు తాగడం ద్వారా డీహైడ్రేట్ బారిన పడకుండా ఉంటారు. నీటితో పాటు ఇంట్లో తయారు చేసుకున్న లెమన్ వాటర్, బట్టర్ మిల్క్, సాల్ట్ -సుగర్ సొల్యూషన్, ఫ్రూట్ జ్యూస్ తీసుకుంటే మంచిది. ప్రయాణ సమయాల్లో నీటిని కూడా తీసుకెళ్లాలి. ఆహార పదార్థాలు, పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉన్నవాటిని ఎంపిక చేసుకోవాలి. వాటర్ మెలన్, మస్క్ మెలన్, ఆరెంజ్, ద్రాక్ష పళ్లు, పైనాపిల్ తదితర పండ్లతో పాటు కూరగాయలను తీసుకోవాలి.

వదులుగా ఉన్న లైట్ కలర్ కాటన్ దుస్తులు ధరిస్తే పెరిగిన ఉష్ణోగ్రతల నుంచి రక్షణకు తోడ్పడతాయి. అదే విధంగా తలను గొడుగు, క్యాప్, టవల్, సంప్రదాయ తలపాగలతో కవర్ చేసుకోవాలి. ఎండకు తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు షఉస్, చెప్పులను ధరించాలి. సాధ్యమైనంత వరకు బయటి గాలి వచ్చే చల్లని ప్రదేశాల్లో ఉండాలి. సూర్యుని నుంచి వేడి నేరుగా ఇంట్లోకి రాకుండా కిటీకీలను, కర్టెన్లను మూసి ఉంచుకుని, రాత్రి సమయంలో, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గాక తెరిచి ఉంచాలి.

పని వేళలను మార్చుకోవాలి

సాధ్యమైనంత వరకు బయటి పనులను ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళలకు మార్చుకోవాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయట (ఓపెన్ ప్లేస్‌లో) పని పెట్టుకోవద్దు. ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్, ఎక్కువ మొత్తంలో ఉన్న షుగర్ కలిగిన పానీయాలు తీసుకుంటే అవి శరీరంలో ఉన్న నీటి శాతాన్ని తగ్గించి కడుపునొప్పికి కారణమవుతాయి.

వడదెబ్బకు సంకేతాలు

మానసికంగా ఆందోళనగా అనిపించడం, గందరగోళానికి గురి కావడం, చర్మం వేడిగా, ఎర్రగా పొడిబారడం, కండరాలు బలహీన పడటం, గుండె అదే పనిగా కొట్టుకోవడం, శ్వాసలో వేగం పెరగడం, నిస్సారంగా మారుతుండటం గమనిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ ఏర్పాట్లు

ఎండకాలం సమీపించి వేడి పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా వైద్యారోగ్యశాఖ చికిత్స కోసం ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లతో పాటు ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బి.రవీందర్ నాయక్ తెలిపారు. అదే విధంగా ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్ వాడీ వర్కర్లకు ఒఆర్ఎస్ సాచెట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు.

సిఐటియు అంటేనే కార్మికులకు భరోసా

- కార్మికుల పక్షాన ఎర్రజెండా : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

కార్మికుల కష్ట సుఖాల్లో ఎర్రజెండా అండగా ఉంటుందని.. సిఐటియు అంటేనే కార్మికులకు ఒక భరోసా అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, కిర్బీ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని శ్రామికభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు చుక్క రాములు సమక్షంలో పెద్దఎత్తున సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు అండగా సిఐటియు ఉంటుందన్నారు. సిఐటియు ద్వారానే కార్మికుల హక్కులు సాధించుకోవచ్చని, చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సాధ్యమవుతాయని తెలిపారు. కిర్బీ పరిశ్రమలో కూడా సిఐటియు ద్వారా అనేక చట్టపరమైన సౌకర్యాలు సాధించామని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు సాధిస్తామని కార్మికులకు భరోసా ఇచ్చారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె రాజయ్య, నాయకులు వివిఎస్ రాజు, తలారి శ్రీనివాస్, మల్లేష్, లక్కన్, మహేశ్వర్ రెడ్డి, రాములు, ప్రవీణ్, మధు, రాజేష్, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగి ఉన్న ఐచర్‌ని ప్రయివేట్ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున మండలంలోని జందాపూర్ 44వ జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జందాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద 44వ జాతీయ రహదారి పైన ఆగి ఉన్న ఐచర్‌ను ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు మృతి చెందగా పదిమందికి గాయాలయ్యాయి. వారిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మార్చి 8న హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్ జాబల్‌పూర్ బయలుదేరినట్టు తెలిపారు. డ్రైవర్ ప్రదీప్ సావ్(35), చత్తీస్‌గఢ్‌కు చెందిన లచన్ సావ్(33) మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ ఫణిధర్, ఎస్ఐ ముజాహిద్, పోలీస్ బృందం ఘటనా స్థలాన్ని సందర్శించారు.

సున్నితత్వం, మానవత్వం నిండిన 'మధు కవనం'

ఆచార్య కాశీం

ప్రజాశక్తి కల్చరల్

మధువనం కవితా సంపుటి లో సున్నితత్వం మానవత్వం పరిమళించే కవితలు వున్నాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య క్షాసీమ్ అన్నారు. మృదుల రచించిన మధుకవనం కవితా సంపుటి ఆవిష్కరణ సభ త్యాగరాయ గానసభ లోని కళా మారుతి కళా వేదిక పై జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కాసీమ్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు కవిత్వం రాసే ప్రతి కవీ కవిత్వం గురించి అమ్మ నాన్న గురించి తప్పక రాస్తారు అని అలాగే మృదుల గొప్పగా భావవ్యక్తీకరణ చేశారు అని ప్రశంసించారు ప్రేమ ప్రకృతి వ్యాఖ్యానించటం కవిత్వం అని మృదుల కవిత్వం అంతా అదేనని అన్నారు స్త్రీ లకు పరిశీలన శక్తి ఎక్కువ అని మృదుల లో అట్టి ప్రతిభ వుందని అభినందించారు. ఐతే నేడు అసమ్మతి ప్రకటిస్తే నే నేరం గా భావించే సందర్భంలో మృదుల వాస్తవ పరిస్థితి పరిశీలన చేసి రాబోయే రోజుల్లో సామాజిక దృక్పథం తో రాయాలని కోరారు అధ్యక్షత వహించిన ఆచార్య మొహమ్మద్ సలీం మాట్లాడుతూ వున్నత విద్యావంతురాలి గా మృదుల తన శిష్య బృందం కు ఆదర్శం గా నిలుస్తారని అన్నారు. సంపుటిని సమీక్ష చేసిన సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ నల్గొండ మట్టి లోనే కవిత్వం వుందని అన్నారు మృదుల నల్గొండ నెల లో పుట్టినందున ఆత్మ గౌరవ ప్రతీకలు గా కవితలు వున్నాయని అభివర్ణించారు రాజ్యాంగ నైతిక అవగాహన వున్నందున సర్వ మత సమాన భావన ఆమె కవిత లో వుందని చెప్పారు. కీలకో పన్యాసం చేసిన డాక్టర్ కె కృష్ణ మూర్తి మాట్లాడుతూ సమాజ హితం సాహిత్య లక్ష్యం ఇనా నియమిత నిబంధనలు వుండవని అన్నారు కవి ఆలోచనలు అక్షర రూపం దాల్చి నప్పుడు అత్యుత్తమ సంస్కారం వ్యక్తీకరణ కావాలని అన్నారు మృదుల కవిత్వం అదే దిశ గా సాగింది అని తెలిపేరు సంఘాన్ని ప్రశ్నించే తత్వం లోతైన అధ్యయనం వాస్తవిక దృష్టితో మృదుల కవిత్వ రచన చేసారు. అని వివరించారు డాక్టర్ త్రిపురం భాస్కర్ రెడ్డి,డాక్టర్ జయ ప్రకాష్ అసిరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఎక్సైజ్' వసూళ్లపై సర్కార్ నజర్..!

- సిఐల మామూళ్ల దందాపై సీరియస్
- సంబంధిత మంత్రికి ఫిర్యాదుల వెల్లువ
- కొరవడిన డిసి, సూపరింటెండెంట్ల పర్యవేక్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎక్సైజ్ శాఖలో వసూళ్ల పర్వంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు ఎక్సైజ్ సీఐలపై ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. బార్లు, పబ్స్, వైన్ షాపుల నుంచి ముక్కుపిండి మరీ మామూళ్లు వసూల్ చేస్తున్నట్టుగా సంబంధిత శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని కొందరు సీఐలు విధి నిర్వహణ కన్నా మామూళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. రంగారెడ్డి డీసీ పరిధిలో పనిచేసే కొందరు సీఐలపై ఎక్కువగా ఈ ఫిర్యాదులు రావడం విశేషం. డీసీ, సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కొరవడంతోనే ఈ దందా సాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై సర్కార్ సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం.

మేడ్చల్-మల్కా.జిగిరి జిల్లాలోని మేడ్చల్ సూపరింటెండెంట్ పరిధిలో 94 బార్లు, 114 వైన్ షాపులు, మల్కాజిగిరి సూపరింటెండెంట్ పరిధిలో 115 బార్లు, 88 వైన్ షాపులు ఉన్నాయి. జిల్లాలో సూపరింటెండెంట్ల పర్యవేక్షణ కొరవడటం, రంగారెడ్డి డీసీకి పని ఒత్తిడి కావడంతో జిల్లాలోని కొందరు సీఐల పని తీరును వారు సరిగ్గా పర్యవేక్షించకపోవడంతో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అవినీతికి అంతేలేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ పరిధిలో పనిచేసే సీఐలలో చాలా మంది వసూళ్లపై ఉన్న శ్రద్ధ విధి నిర్వహణలో ఉండటం లేదని, వైన్స్‌లు, బార్లు, పబ్బుల నుంచి వసూళ్లతోపాటు వాటి పంపకాల్లోనూ కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులకు తేడాలు వస్తున్నాయని, దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నట్టు ఉన్నతాధికారులకు, మంత్రికి ఫిర్యాదులు అందడం గమనార్హం. దీంతోపాటు సీఎంఓకు కూడా ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం వారి అవినీతిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

ఎక్కువ ఫిర్యాదులు ఇలా..

కుత్బుల్లాపూర్, బాలానగర్, ఉప్పల్, ఘట్‌కేసర్‌తోపాటు మరికొన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లపై ఎక్కువగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఎక్సైజ్ సీఐల పరిధిలో 24 గంటలపాటు మద్యం దొరుకుతుందని, స్థానికంగా కొన్ని ప్రాంతాల్లో అడ్డాలను ఏర్పాటు చేసి ఈ అమ్మకాలు కొనసాగిస్తూ ఆయా పీఎస్‌ల పరిధిలోని ఎక్సైజ్ పోలీసులు అందినకాడికి దండుకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. బార్ల ట్రాన్స్‌ఫర్ల విషయంలోనూ భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, దీనివల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని కొందరు వైన్ షాపులు, బార్ల యజమానులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం గమనార్హం. పలు పీఎస్‌ల పరిధిలో గుడుంబా, గంజాయి, కల్తీ కల్లు, తదితర వాటిని అరికట్టడంలో ఆయా సీఐలు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలోనూ పలు ఆరోపణలు..

మద్యం షాపుల టెండర్లు ముగిసిన వెంటనే మామూళ్ల పర్వం మొదలు పెట్టినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కొత్త వైన్ షాపుల నిర్వహణ ప్రారంభం రాకముందే దుకాణానికి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి అధికారులు వాటాలేసుకున్నట్టు అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. 2023-25కి జిల్లాలో లక్కీ డ్రా తీశారు. ఎంపికైన వారికి ప్రొవిజినల్ లైసెన్సులు జారీ చేశారు. మొదటి వాయిదా ఫీజును చెల్లించి, ప్రొవిజినల్ లైసెన్సులు తీసుకుంటున్న కొత్త వైన్ షాపుల యజమానుల నుంచి అధికారులు రూ.2 లక్షల చొప్పున వసూలు చేశారని, ఎక్సైజ్ స్టేషన్ల ఖర్చు పేరిట ఈ డబ్బులు వసూలు చేశారని గతంలో అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. 'రెండేండ్లపాటు మీకు, మాకు అనుబంధం ఉంటుంది. రూ.కోట్లు పెట్టి వైన్ షాపులు నిర్వహించబోతున్న మీకు రూ.2 లక్షలు పెద్ద ముచ్చటే కాదు' అంటూ వసూలు చేసినట్టు సమాచారం. ఇందులో పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు సంబంధిత శాఖ అధికారులు వాటాలేసుకుని మరీ పంచుకోవడం పట్ల అప్పట్లో చర్చ జరిగింది. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే భవిష్యత్‌లో నిబంధనల పేరుతో వేధిస్తారని భయపడి యజమానులు చెల్లించినట్టు సమాచారం.

వేలం పాటకు ఖర్చుల పేరుతో వసూళ్లు..!

2023-25 సంవత్సరాలకుగాను ప్రభుత్వం రెండు నెలల ముందుగానే వైన్ షాపుల వేలం పాట నిర్వహించిన విషయం తెలిసిందే. ఊహించని విధంగా ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. వైన్ షాపులు కేటాయించటానికి అధికారులు నాగోల్‌లోని ఫంక్షన్ హాళ్లలో డ్రా నిర్వహించారు. లాటరీలు తీయటానికి ఖర్చులయ్యాయి.. షాపుల కేటాయింపు పూర్తయిన తర్వాత ఒక్కో వైన్ షాపు యజమాని రూ.2 వేలు చెల్లించాలంటూ హుకూం జారీ చేశారు.